నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 22 మార్చి 2025 VIKARABAD



తాండూరు : యాలాల మండలంలోని గిరిజాపూర్‌లో నీళ్లు లేక ఎండిన వరి చేను



## నీళ్లు లేక పంట ఎండింది..

నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా.. అందులోని రెండు ఎకరాల్లోని పంట పూర్తిగా ఎండిపోయింది. బోరు నుంచి నీరు సన్నగా వస్తుండడంతో మిగిలిన పంట పండుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. ఆ బాధతో నా భర్త అనారోగ్యం పాలయ్యాడు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ పంటల సాగుకు ముందే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని సమయానికి ముందే అందించేవారు. దాంతో విత్తనాలు, ఎరువులను తెచ్చుకునేది. కానీ, కాంగ్రెస్ పాలనలో పెట్టుబడిసాయం కూడా సక్రమంగా అందడం లేదు. అప్పులు తీసుకొచ్చి పంటను సాగు చేసినా భూగర్భజలాలు అడుగంటుతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

**-బోనస్ అమృత, రైతు, గిరిజాపూర్, తాండూరు**

## ఎండిన పంటను చూస్తే కన్నీళ్లు ఆగడం లేదు..



ఎప్పటిలాగే నాలుగున్నర ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లో నీరు ఇంకిపోయి వరి పంట ఎండుముఖం పడుతున్నది. చేతికొచ్చిన పంట నీళ్లు లేక ఎండిపోవడం చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదు. రేవంత్ సర్కార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకున్నా.. అప్పులు తీసుకొచ్చి పంట ను సాగు చేశా. మాజీ సీఎం కేసీఆర్ రైతాంగాన్ని ఆదుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తున్నది. పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎం డిన పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి. **-వెంకటేశ్, రైతు, గిరిజాపూర్**



## మూడెకరాలు ఎండిపోయింది..

నేను ఐదు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. భూగర్భజలాలు తగ్గి బోర్ల నుంచి నీరు సరిపడా రాకపోవడంతో ఇప్పటికే మూడు ఎకరాల్లోని పంట పూర్తిగా దెబ్బతి న్నది. రెండు ఎకరాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు చాలా ఇబ్బంది పడుతు న్నా. అప్పులు తీసుకొచ్చి పంటను సాగు చేశా. పెట్టుబడి కూడా వస్తుందన్న నమ్మకం లేదు. తీసుకొచ్చిన అప్పులు తీర్చే మార్గమూ కనిపించడంలేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. **- రాజూనాయక్, ముష్టిపల్లితండా, కొందుర్గు**

## పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొన్నది..



నేను రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. వ్యాపారుల వద్ద వడ్డీకి డబ్బు తీసుకొచ్చి పంటను సాగు చేశా. ఎండలు ముదురుతుండడంతో చేతికొచ్చిన పంట ఎండిపోతున్నది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొన్నది. తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వమే స్పందించి ఆదుకోవాలి. **- కృష్ణయ్య, రైతు, గుర్రంపల్లి, కొందుర్గు**



కొందుర్గు మండలంలోని గుర్రంపల్లిలో ఎండిపోయిన వరి పంట



# ఎంత కష్టం నష్టం

## పొలాలకు బీళ్లు.. రైతుకు కన్నీళ్లు

ఫీల్డ్ విజిట్

- కనుచూపు మేరలో ఎండిన పంటలే..
- అన్నదాతకు మిగిలింది అప్పులే..
- పెట్టుబడి వచ్చే పరిస్థితీ లేదంటున్న రైతన్న
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కర్షకుడి దుస్థితి

నీళ్లు లేక వరి పంట ఎండిపోతున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భజలాలు అడుగంటుతుండడంతో వ్యవసాయ బోరు బావుల్లోనూ నీరు ఇంకిపోతున్నది. ఫలితంగా చేతికందే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు అన్నదాతల అవస్థ అంతా.. ఇంతా కాదు. కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకున్నా.. వ్యాపారులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి సాగు చేసి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు ఎండిపోతుండడంతో అన్నదాత బోరున్న విలపిస్తున్నాడు. దిక్కుతోచని స్థితిలో వరి చేనుల్లో పశువులను మేపుతున్నాడు. పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదని.. తీసుకొచ్చిన అప్పులు తీర్చే మార్గ మూ కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. .. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

**- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ**



సుల్తాన్‌పూర్ గ్రామంలో ఎండిన వరి పంట

## ఎండిన పంట.. పశువుల మేతకు..




సుల్తాన్‌పూర్ గ్రామంలో రైతులతో కలిసి ఎండిన పంటను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్

దౌల్తాబాద్ : భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో మండలంలోని బో రు బావుల వద్ద సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. సుల్తాన్‌పూర్ గ్రామంలోని రైతు కావలి మొగులప్ప అనే రైతు సాగు చేసిన రెండెకరాల వరి పంటకు సాగునీరు అందక పూర్తిగా ఎండిపోవడంతో అందులో పశువులను మేపుతున్నారు. గతంలో భూగర్భజలాలు పుష్కలంగా ఉండి రెండు పంటలను సాగు చేసుకునే వారిమని.. ప్రస్తుతం అవి అడుగంటిపోతుండడంతో గుండె కోత తప్పడం లేదని పలువురు అన్నదాతలు పేర్కొంటున్నారు. కాగా ఎండిన పంటను దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ ముదిరాజ్ పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పంట ఎండి నెర్రెలు వచ్చాయి


బోరు ఉన్నదనే నమ్మకంతో నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. అయితే, రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటి బోరు నుంచి వచ్చే నీరు ఆగిపోవడంతో రెండు ఎకరాల్లోని పంట ఎండిపోయి భూమిలో నెర్రెలు వచ్చాయి. మిగిలిన రెండెకరాల పొలానికి పక్క బోరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. ఉన్న బోరును ఫ్లషింగ్ చేయిద్దామంటే చేతిలో రూపాయీ లేదు. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడంతో తెలిసిన వారి వద్ద రూ.70,000 అప్పుగా తెచ్చి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేశా. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించడంలేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలి.

**-వెంకట్‌రెడ్డి, రైతు, చింతామణి పట్టణం, తాండూరు రూరల్**



వట్టిపోయిన బోరును చూపుతున్న రైతు వెంకట్‌రెడ్డి

నీరు లేక పొలంలో వచ్చిన పగుళ్లు





లేమామిడి శివారులో సాటి రైతు సాయంతో కాపాడుకుంటున్న వరి పంట

## ఎండుతున్న పంటలను ఆదుకుంటున్న సమీప రైతులు

కేశంపేట: రోజురోజుకూ ముదురుతున్న ఎండలతో పంటలు దెబ్బతింటుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలు చేతికొచ్చే సమయానికి భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు ఇంకిపోతుండడంతో సగానికిపైగా బోర్లు నీరు పోయడంలేదు. బోరు మోటర్లను నమ్ముకొని పంటలను సాగు చేసిన రైతన్న ఎండుతున్న పంటలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలో కొద్దిమేర పంటలు పాడవకుండా ఉన్నాయంటే అందుకు సమీప పొలాల్లోని రైతులు అందిస్తున్న నీటి సాయమే కారణం. ఆ నీళ్లు కూడా ఇంక ఎన్ని రోజుల వరకు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. గత వానకాలంలో 4000 ఎకరాల్లో సాగైన వరి పంట నేడు 2,200 ఎకరాలకు పరిమితమైనట్లు వ్యవసాయశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడంతో రైతన్న ఆవేదన అంతా..ఇంతా కాదు.

# నాడు ఆదర్శం..నేడు అధ్వానం..

- కేసీఆర్ హయాంలో స్వచ్ఛ అవార్డులు అందుకున్న పల్లెలు.. నేడు సమస్యల వలయంలో..
- అస్తవ్యస్తంగా మారిన 15 నెలల కాంగ్రెస్ పాలన
- రూపాయీ విదల్చని రేవంత్‌రెడ్డి
- మూలన పడిన ట్రాక్టర్లు... అధ్వానంగా పారిశుధ్యం


వికారాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వంలో స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దుకున్న పల్లెల్లో ప్రస్తుతం పాలన పడకేసింది. పల్లెప్రగతి కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చి దేశంలో ఎక్కడాలేని విధంగా పచ్చని పల్లెలుగా అవార్డులను సొంతం చేసుకున్న గ్రామ పంచాయతీల్లో పాలన గత 15 నెలలుగా అస్తవ్యస్తంగా మారింది. రేవంత్ సర్కార్ ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు నయా పైసా నిధులివ్వకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయి. అదేవిధంగా పల్లెల్లో గతేడాదిగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ప్రత్యేకాధికారులను నియమించారే తప్పా కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయీ జీపీలకు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు ఏడెనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వా రు పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూ పక పోవడంతో ఎక్కడ చూసినా ము రుగునీటి ప్రవాహం, చెత్తాచెదారమే దర్శనమిస్తున్నది. అదేవిధంగా కనీసం డ్రైనేజీ పైపు లైన్‌కూ మరమ్మతులు చేయలేని దుస్థితి నెలకొనడంతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. బీఆర్ఎస్ హయాంలో అద్దంలా మెరిసిన గ్రామ పంచాయతీల్లోని రోడ్లు ప్రస్తుతం మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇచ్చి న ట్రాక్టర్లు కూడా ప్రస్తుతం మూలనపడ్డాయి. దీం తో ప్రతిరోజూ ఇంటింటి నుంచి సేకరించే చెత్త గ్రా మాల్లో నిలిచిపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపిస్తున్నది. గతేడా ది వేసవిలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు చేసిన మరమ్మతులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించ లేదు. ఆ మొత్తం దాదాపుగా రూ. నాలుగు కోట్ల వరకు ఉన్నది.



నవాబుపేట మండలం మాదారం గ్రామంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం

మాదారంలో మురికిగుంట









నిర్వహణ లేక మూలనపడ్డ ట్రాక్టర్



జంబిగడ్డలో చక్కర్లు కొడుతున్న డ్రోన్

## చేవెళ్లలో డ్రోన్ల కలకలం

- రెండు రోజులుగా రాత్రి సమయంలో చక్కర్లు
- భయాందోళనలో స్థానికులు

చేవెళ్లటౌన్, మార్చి 21 : గత రెండు రోజులుగా రాత్రి సమయంలో చేవెళ్లలోని జంబిగడ్డ వద్ద డ్రోన్లు తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. రాత్రివేళల్లో నాలుగు నుంచి ఐదుసార్లు అవి గ్రామం చుట్టూ తిరుగుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. డ్రోన్లు గ్రామం చుట్టూ ఎందుకు తిరుగుతున్నాయో పోలీసులు తెలుసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.